### వామ్మో బయటి ఫుడ్డా?



మేం ప్రతి వీకెండ్‌లో ఫ్యామిలీ లేదా స్నేహితులతో డిన్నర్ ప్లాన్ చేస్తుంటాం. కానీ ఇటీవల హోటల్స్, రెస్టారెంట్‌లలో కుళ్లిన ఆహారం బయటపడటం చూశాక భయం వేస్తుంది. ఇన్ని రోజులు మేం తింటున్న ఆహారంలో వినియోగించినవన్నీ కాలం ముగిసినవేనా.? అనే అనుమానం వస్తుంది. రుచి కోసం ఏవేవో కెమికల్స్ వినియోగిస్తున్నారు. అది ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. మేం వీకెండ్ డిన్నర్స్‌ను రద్దు చేసుకున్నాం. అనారోగ్యం తెచ్చుకోవడానికి సిద్ధంగా లేము.

-ప్రసన్న జ్యోతి, ఆర్టిస్టు

# హోటల్‌కు వెళ్తున్నారా.. కిచెన్‌ను పరిశీలించండి.!

తళుకుల మాటున.. కుళ్లిన ఆహారం

- పాచి, పురుగులు పట్టిన ఆహారాన్నే.. వేడిచేసి వడ్డిస్తున్న వైనం
- ఎక్స్‌పైర్ ఐపోయిన సామగ్రి వినియోగం
- చెత్తా చెదారం, బొద్దింకలు, ఈగలు, బల్లులతో కిచెన్లు దర్శనం
- నగరంలో కొనసాగుతున్న ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు
- టెర్రర్ పుట్టిస్తున్న అవుట్‌సైడ్ ఫుడ్..
- కిచెన్‌లను కస్టమర్లు పరిశీలించే విధానం తప్పనిసరి చేయాలని డిమాండ్





రెండు రోజుల కిందట నగరంలోని ఓ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించిన జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు



సిటీబ్యూరో, మే 26 ( నమస్తే తెలంగాణ ) : జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. అవుట్ సైడ్ ఫుడ్‌పైనే అత్యధికంగా ఆధారపడే ఆహార ప్రియుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇటీవల వరుస దాడులతో హోటళ్లు, రెస్టారెంట్లు, బార్‌ల నిజస్వరూపం బయటపడుతుంది. నోరూరించే వంటకాలతో.. మెరిపించే అలంకరణలతో ఆహార ప్రియులను తియ్యగా మోసం చేసిన హోటల్స్.. నగరవాసుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. ఇటీవల కేఎఫ్‌సీ, కృతుంగ, రెస్టో బార్‌లోనూ.. నాణ్యతలేని ఆహారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికీ అధికారులు దాడులు పలు హోటళ్లలో ముమ్మరం చేశారు.

*"ఇన్ని రోజులు మనం తింటున్న ఆహారం కుళ్లిన పదార్థాలతో తయారు చేసిందా? మనం గొప్ప రెస్టారెంట్ అని భావిస్తున్న దాంట్లో కూడా ఇంత అధ్వానమా? కిచెన్‌లో ఈగలు, దోమలు, బల్లులు, బొద్దింకల స్వైర విహారం.. అందులోనే మనం ఆర్డర్ ఇచ్చిన వంటకాల తయారీ? ఇక బయట ఫుడ్ తినొద్దు." అంటూ నగరవాసులు నిర్ణయించుకుంటున్నారు.*

### వీకెండ్స్.. నో డిన్నర్స్..!

ఫుడ్ సేఫ్టీ అధికారుల దెబ్బతో చాలా మంది వీకెండ్స్ డిన్నర్, లంచ్ ప్రోగ్రాంలు రద్దు చేసుకుంటున్నారు. పిల్లలతో కలిసి బయటకు వెళ్లి సందర్శన ప్రాంతాలను వీక్షించి లంచ్, డిన్నర్‌లు ఇష్టమైన రెస్టారెంట్‌లో తినేసి ఇంటికి వెళ్తుంటారు. కానీ ఇటీవల నగరంలో కుళ్లిన వంటకాలు హోటల్స్‌లో వడ్డిస్తున్నారనే విషయం బయటకు రావడంతో వాళ్లంతా బయట ఆరగించడానికి సంశయిస్తున్నారు. ఏ హోటల్, రెస్టారెంట్‌ను చూసినా అనుమానంగా చూసే పరిస్థితి వచ్చింది. అనారోగ్యం కొని తెచ్చుకోవడం ఎందుకని ఆలోచిస్తున్నారు.

### కిచెన్‌లోకి నో ఎంట్రీ ఎందుకంటే..

సాధారణంగా హోటల్స్, రెస్టారెంట్స్‌లో కిచెన్‌లను పరిశీలిస్తే మనం అక్కడ తినొచ్చా? లేదా? అనేది అర్థమైపోతుంది. కానీ కిచెన్‌లోకి అనుమతి ఉండదు. కిచెన్ కనిపించకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుంటారు. గడువు ముగిసిన మసాలాలు, కుళ్లిన కోడిగుడ్లు, దుర్వాసన వెదజల్లే మాంసం, గడువు ముగిసిన పన్నీరు ఇలా సర్వం కల్తీతోనే వంటకాలను తయారు చేస్తున్నారు. ఏమాత్రం నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనేది ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు సూచిస్తున్నాయి.

### మందుబాబులూ జరభద్రం..!

నగరంలో బార్ అండ్ రెస్టారెంట్స్, సిట్టింగ్ వైన్స్‌లో కిచెన్‌లను ఏర్పాటు చేసి మందుబాబులకు వంటకాలు అందుబాటులో ఉంచుతున్నారు. అక్కడ వినియోగించే ఫుడ్‌లో కుళ్లిన ఉల్లిగడ్డలు, మసాలాలు, మాంసం, కోడిగుడ్లు తదితర వాటితో ఘుమఘుమలాడించేల వంటకాలను సర్వ్ చేస్తున్నారు. మందుబాబులంతా మద్యం తాగడంలోని బిజీగా మారుతుండటంతో వాళ్లకు ఎలాంటి ఫుడ్ సర్వ్ చేస్తున్నారో కూడా తెలియడం లేదని అధికారులు చెబుతున్నారు. ఇటీవల కొన్ని బార్స్ అండ్ రెస్టారెంట్స్‌లో కూడా అధికారులు దాడులు చేసి కిచెన్‌లో కుళ్లిన వంటకాలను గుర్తించారు. ఓవైపు మద్యం, మరోవైపు కుళ్లిన ఆహారంతో మందుబాబుల ఆరోగ్యం గుల్ల అవ్వడం ఖాయమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా వరకు నగరంలోని బార్‌లలో ఇలాంటి దుస్థితే ఉన్నదని చెబుతున్నారు. సాధ్యమైనంత వరకు అవుట్‌సైడ్ ఫుడ్ తినకపోవడమే శ్రేయస్కరమని తెలిపారు.

### నిరంతరం దాడులు చేయాలి : సంతోష్, ఐటీ ఉద్యోగి.



నగరంలో చాలా మంది బయటి ఫుడ్‌పైనే ఆధారపడుతుంటారు. ఉద్యోగాల బిజీలో పడి ఇంట్లో వంట చేయడమే చాలా మంది మరిచిపోతున్నారు. ఉదయం టిఫిన్ నుంచి రాత్రి డిన్నర్ వరకు ఇందులో ఏదో ఒక్కటి మాత్రం బయట హోటల్స్‌లోనే చేస్తున్నారు. అంతలా బయటిఫుడ్ వినియోగం పెరిగింది. అయితే ఈ విధానం అనారోగ్యాన్ని అత్యంత తొందరగా తెచ్చుకోవడమే. ప్రాసెస్డ్ ఫుడ్‌తో పిల్లలకు టిఫిన్స్, స్నాక్స్ అని చెబుతూ తినిపిస్తున్నారు. అధికారులు ఈ దాడులను కొన్ని రోజులే చేయకుండా నిరంతరం కొనసాగిస్తూ ఉండాలి.

## విద్యుత్ హైటెన్షన్ టవర్లను మార్చేశాం

- అటవీ శాఖ అధికారి వివరణ

- నమస్తే కథనానికి స్పందన

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ) : చిలుకూరు మృగవని జాతీయ ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన హైటెన్షన్ విద్యుత్ పోల్స్ దూరంగా ఏర్పాటు చేశామని, దీనివల్ల పార్కులోని జంతువులు, పక్షులకు హాని జరగడం లేదని రంగారెడ్డి జిల్లా అటవీ అధికారి పేర్కొన్నారు. ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'అంతమవుతున్న అటవీ ప్రాంతం – ప్రమాదకరంగా హైటెన్షన్ వైర్లు 'అనే కథనంతో ప్రచురితమైన వార్తకు అటవీ శాఖ వివరణ ఇచ్చింది. ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్-1980 ద్వారా అనుమతులు ఇచ్చామని, దానికి అనుగుణంగానే హైటెన్షన్ విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా చిల్కూరు రిజర్వ్ ఫారెస్ట్ మొత్తం విస్తీర్ణం 490 హెక్టార్లు ఉండగా, 700 ఎకరాలలో ఉన్న జింకల పార్కును జాతీయ పార్కుగా 1998లో ప్రకటించినట్లు తెలిపారు. అప్పుడు పొరపాటున 280.29 హెకార్టు రాసే బదులు 360 హెక్టార్లుగా రాశారని, దీనికి సంబంధించి డీజీపీఎస్ సర్వే చేసి జాతీయ పార్కు విస్తీర్ణం 280.29 హెక్టార్లుగా నిర్ధారిస్తూ ప్రభుత్వానికి గెజిట్ నోటిఫికేషన్‌లో ఉన్న విస్తీర్ణాన్ని సవరించాల్సిందిగా ప్రతిపాదన పంపించామని పేర్కొన్నారు. జాతీయ పార్కును అనుకొని ఉన్న నార్సింగి, మంచిరేవుల పాతరోడ్డును వాడడం లేదని, అదేవిధంగా జాతీయ పార్కును నర్సరీ, ఓఆర్ఆర్ డైవర్షన్ అయిన విస్తీర్ణంలో పోగా మిగిలిన చిల్కూరు రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో కొత్తగా ట్రెక్ పార్కును టీజీఎఫ్‌డీసీ ద్వారా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని వివరణ ఇచ్చారు.

## ముగిసిన క్రియేటివ్ కేరీర్ ఎడ్యుకేషన్ సమ్మిట్ - 24

బేగంపేట్ మే 26: జవహర్‌లాల్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ టాస్క్ ఎంఎస్ఎంఈ సంస్థల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు బేగంపేట్ మనోహర హోటల్‌లో జరిగిన క్రియేటివ్ కేరీర్ ఎడ్యుకేషన్ సమ్మిట్ 2024 ఆదివారంతో ముగిసింది. ఈ సమ్మేట్‌లో వివిధ రంగాలకు చెందిన నిపుణులతో పాటు సుమారు వెయ్యి మంది మంది విద్యార్థులు హాజరైనట్టు నిర్వాకులు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా గేమింగ్, ఫిల్మ్ మేకింగ్, ఫ్యాషన్ మేకింగ్, యానిమేషన్, వీఎఫ్ఎక్స్, ఫొటోగ్రఫీ తదితర రంగాలకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులో ఉంచారు. విద్యార్థులకు ఆయా రంగాల ప్రతినిధులు పాల్గొని అవసరమైన రంగాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకున్న సందేహాలను నివృత్తి చేసుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

## పట్టుదలతో శ్రమిస్తే.. విజయం మీ సొంతం




సభా వేదిక వద్ద మాట్లాడుతున్న మల్లారెడ్డి

### మాజీ మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్, మే 26 : అమెరికా తెలంగాణ తెలుగు అసోసియేషన్ సభల్లో మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. 2006-10 బ్యాచ్ సీఎంఆర్ విద్యార్థి చందు రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సభలో మల్లారెడ్డితో పాటు సీఎంఆర్ విద్యా సంస్థల చైర్మన్ గోపాల్‌రెడ్డి, సినీ నిర్మాత దిల్ రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ తెలుగు వారిని ఉద్దేశించి, స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. జీవితంలో విజయం సాధించాలంటే కష్టపడాలని సూచించారు. ఏఈ, డేటా సైన్స్ తదితర నూతన సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించి, పట్టుదలతో శ్రమిస్తే విజయాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు.

## ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్.. గ్రేటర్ అధ్యక్షుడిగా దయానంద్

హిమాయత్‌నగర్, మే 26 : రాష్ట్ర ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా దయానంద్ నియమితులయ్యారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్ ఆదివారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఎస్.దయానంద్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ ఆటో కార్మికులు ఉన్నత విద్యను చదువుకున్నప్పటికీ సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో స్వశక్తితో ఆటోలను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నరసింహారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోదా మల్లేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో దయానంద్‌ను సత్కరిస్తున్న చంద్రశేఖర్



వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో హైకోర్టు జస్టిస్ భీమపాక నగేశ్

## పిల్లలకు కష్టం విలువ తెలియాలి

- తెలంగాణ హైకోర్టు జస్టిస్ భీమపాక నగేశ్

కవాడిగూడ, మే 26 : కోట్లాది మంది ప్రజలను తన మాటలనే తూటాలతో జాగృతం చేసిన స్వామి వివేకానంద స్ఫూర్తిని అందుకున్న చిన్నారులు ఆదర్శవంతులుగా ఎదుగుతారని తెలంగాణ హైకోర్టు జస్టిస్ భీమపాక నగేశ్ అన్నారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠంలో 15 రోజుల పాటు నిర్వహించిన సంస్కార్ వేసవి శిక్షణ కార్యక్రమ ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పిల్లలకు కష్టం విలువ తెలియజేయాలని, అప్పుడే వారు జీవితంలో పోరాట పటిమను అలవర్చుకుంటారని తల్లిదండ్రులకు సూచించారు. రామకృష్ణ మఠం హైదరాబాద్ అధ్యక్షుడు స్వామి బోధమయానంద మాట్లాడుతూ ఎక్కడైతే స్వచ్ఛత, నిస్వార్థగుణాలు ఉంటాయో అక్కడే ప్రపంచం తలవంచుతుందని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## జూన్ 10వ తేదీలోపు డబుల్ ఇండ్లలో సౌకర్యాలు కల్పించాలి

- హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం డిమాండ్





సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

చిక్కడపల్లి, మే 26 : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు కరెంట్, మంచినీటి, లిఫ్ట్ సౌకర్యాలు కల్పించాలని హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2బీహెచ్‌కే ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం(హెచ్.సీ.ఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డబుల్ బెడ్రూం ఇండ్లకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేటాయించిన డబుల్‌బెడ్ రూం ఇండ్లకు ఇప్పటి వరకు కరెంటు, మంచినీరు, లిఫ్ట్ సౌకర్యాలు లేవని విమర్శించారు. జూన్ 10వ తేదీ నాటికి కనీస సౌకర్యాల కల్పన ప్రక్రియ పూర్తి కావాలని, లేని పక్షంలో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులతో కలిసి ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఫోరం నాయకులు ఆర్.వెంకటేశ్, కె.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్, జపాన్ దేశాల మధ్య స్నేహ సంబంధం



జపాన్‌దేశ వైజ్‌మెన్ సేవా సంస్థల ప్రతినిధి కుసాత్సుబురో యోషినోను సన్మానిస్తున్న జి.వసుంధర

చిక్కడపల్లి, మే 26 : భారత్, జపాన్ దేశాల ప్రజల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించేందుకు ఆరు దశాబ్దాలుగా వైజ్‌మెన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కృషి చేయడం అభినందనీయమని రాష్ట్ర ఖజానా శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర అన్నారు. ఆదివారం వైజ్ మెన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జి.వసుంధర ముఖ్య అతిథిగా హాజరై జపాన్ దేశ వైజ్‌మెన్ సేవా సంస్థల ప్రతినిధి కుసాత్సుబురో యోషినోను సంస్థ అధ్యక్షురాలు నిష్టల సుధామాలతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైజ్‌మెన్ ఉద్యమ ప్రముఖులు వేమరాజు వినయ్‌కుమార్, రజిత్ ఆకుల, బి.వి.నారాయణ రావు, వై.ఎం.సీ.ఏ ప్రతినిధులు డాక్టర్ వినయ్ స్వరూప్, ఎస్.రామనాథ్, కె.చక్రపాణి, ఎం.కుసుమకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవైష్ణవ సేవా సంఘం రజతోత్సవ వేడుకల బ్రోచర్ ఆవిష్కరణ




రజతోత్సవ వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి, మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాలచారి

మన్సూరాబాద్, మే 26 : శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ రజతోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి, మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాలచారి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి చంద్రపురికాలనీలోని శ్రీవైష్ణవ సదనంలో ఆదివారం సంఘం అధ్యక్షుడు తిరువేంగళాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వారు హాజరై జూలై 20న నిర్వహించనున్న రజతోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. శ్రీవైష్ణవ సంఘం ప్రతినిధులు, బంధువులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కండ్లకుంట యాదగిరి చార్యులు, ప్రధానకార్యదర్శి సేనాపతి మోహన్, సభ్యులు శ్రీనివాసాచార్యులు, రత్నకుమార్, కృష్ణమాచారి, మాధవాచార్యులు, ఆచార్య వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య రవ్వా శ్రీహరి జీవనసాఫల్య పురస్కారాల ప్రదానం

తెలుగు యూనివర్సిటీ, మే 26 : ఆచార్య రవ్వా శ్రీహరి మహోన్నతమైన వ్యక్తి అని పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కొనియాడారు. ఆచార్య రవ్వా శ్రీహరి జీవనసాఫల్య పురస్కారాల ప్రధానోత్సవం ఆదివారం పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఘనంగా జరిగింది. తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు ఆచార్య కె.యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సంస్కృత పండితులు ఆచార్య శలాక రఘునాథ శర్మకు, ప్రముఖ భాషా పరిశోధకులు డాక్టర్ నలిమెల భాస్కర్‌కు పురస్కారం ప్రదానం చేశారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.50 వేల నగదును ఆచార్య రవ్వా శ్రీహరి సతీమణి అనంతలక్ష్మి అందజేశారు. 10 మంది విద్యార్థులకు ఆచార్య రవ్వా శ్రీహరి యువ ప్రతిభ సంస్కృత నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ వెలిచాల కొండల్‌రావు, ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, డాక్టర్ శ్రీరంగాచార్య, ఆచార్య ఎ.రాములు, ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, డాక్టర్ అప్పం పాండయ్య, ప్రముఖ సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, కె.రామచంద్రమూర్తి తదితరులు పాల్గొని ఆచార్య రవ్వా శ్రీహరి తెలుగు, సంస్కృతం, తెలంగాణ మాండలిక నిఘంటువు నిర్మాణానికి చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా ఆచార్య రవ్వా శ్రీహరి రచించిన ఆంధ్రపద నిదానం పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు.



ఆచార్య రవ్వా శ్రీహరి పేరిట నెలకొల్పిన జీవనసాఫల్య పురస్కారాన్ని ఆచార్య శలాక రఘునాథ శర్మకు ప్రదానం చేస్తున్న వక్తలు

## మూఢ నమ్మకాలపై అవగాహన



*సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా చేతిలో కర్పూరం వెలిగించుకొని అవగాహన కల్పిస్తున్న దృశ్యం.*

## ఇజ్రాయిల్ దాడులను ఖండించాలి

కవాడిగూడ, మే 26 : పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ప్రపంచ దేశాలు ముక్త కంఠంతో ఖండించి పాలస్తీనాలో శాంతి నెలకొనే విధంగా కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో ఆలిండియా తంజీమ్ ఈ ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మునీర్ పటేల్ అధ్యక్షతన సంఘీబావ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి బి.చంద్రకుమార్, తెలంగాణ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.కోదండరామ్, మాజీ ఎంపీ అజీజ్ పాషా, అవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్, నాయకులు ఉస్మాన్ అలీ హజారీ, న్యాయవాది అఫ్జల్, సీపీఐ నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో అభివాదం చేస్తున్న నేతలు